RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ | బుధవారం 21-02-2024 | ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ | సంపుటి : 06 | సంచిక : 48 | పేజీలు : 4 | వెల : రూ 2-00







## సోనియాగాంధీ ఏకగ్రీవ ఎన్నిక..

రాజస్థాన్ నుంచి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే రాష్ట్రం నుంచి నామినేషన్ వేసిన బిజేపీ నేతలు చున్నీలాల్ గరాసియా, మదన్ రాథోడ్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎన్నికలకు

మంగళవారమే చివరిరోజు. ఇతరులెవరూ నామినేషన్ వేయకపోవడంతో ఈ ముగ్గురూ ఎన్నికైనట్లు ప్రకటించారు.గాంధీ కుటుంబం నుంచి రాజ్యసభకు ఎన్నికైన రెండో నాయకురాలు సోనియాగాంధీ. గతంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1964లో రాజ్యసభకు ఎన్నికయ్యారు.

# తెలంగాణ రాష్ట్రంలో...రజాకార్ల పాలన ఇంకా బ్రతికే ఉంది



**మోడీ అభివృద్ధి చేసినా హైవేలపైనే రాహుల్ ప్రియాంకల పాదయాత్ర...**
**నమ్మకం లేని రాహుల్ ఇంజన్ సర్కార్ ..... భైంసా బహిరంగ సభలో...**
**అస్సాం సిఎం హేమంత బిశ్వశర్మ....**





బైంసా,ఫిబ్రవరి 20(లోకంతీరు)తెలంగాణలో ఇంకా రజాకార్ల పాలన కొనసాగుతూనే ఉందని, అభివృద్ధి చేయలేదని నిందించే కాంగ్రెస్ కి మోడీ అభివృద్ధి చేసినటువంటి జాతీయ రహదారులపైనే ప్రియాంక గాంధీ,రాహుల్ గాంధీ లు పాదయాత్రలు చేపట్టడమే సమాధానమని అస్సాం సీఎం హేమంత బిశ్వశర్మ అన్నారు. మంగళవారం విజయ సంకల్ప బస్సు యాత్రలో భాగంగా బైంసా పట్టణంలోని స్థానిక ఎస్.ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ విజయ సంకల్ప యాత్ర 5500 కిలోమీటర్ల మేర సాగనుందని, మూడోసారి ముచ్చటగా మోదినే ప్రధానమంత్రిగా చేసి, దేశం అభివృద్ధి పదంలో సాగాలనే ఉద్దేశంతో యాత్ర కొనసాగుతుందని అన్నారు. తెలంగాణలో బిజెపి రోజురోజుకు బలపడుతుందని 2018 సంవత్సరంలో 6.8% ఓట్లు సంపాదించగా, 2023 లో 14.9% ఓట్లు శాతం వచ్చాయన్నారు. బి.ఆర్.ఎస్,కాంగ్రెస్ ఒక్కటేనని,వీళ్ళ పాలన రజాకార్ల పాలనని ,దీన్ని అంతం చేసే రోజులు ఆసన్నమైందన్నారు. భారత ప్రజలు కాంగ్రెస్ నీ తరిమి మోడీని తీసుకొచ్చారని, మోడీ రామ మందిరాన్ని తీసుకొచ్చారని ప్రస్తుతం ప్రజలు మోడీని ముచ్చటగా మూడవ సారి ప్రధాని గా చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత మోడీకె దక్కిందన్నారు. తెలంగాణలో అధికారం చేపట్టినటువంటి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేకపోతుందని, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ ఊసే లేదని అన్నారు.ప్రదాని మోడీ మాత్రం పక్కాగా హామీలను నెరవేర్చే వ్యక్తి అని కొనియాడారు. అస్సాం రాష్ట్రంలో పెట్రోల్ 98 రూపాలు కాగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ పై టాక్స్ వేసి 110 రూపాలకు ఇస్తు ప్రజలపై భారాన్ని వేస్తున్నారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితులలో ఉచిత వ్యాక్సిన్ ఇచ్చిన ఘనత మోడీదేనని, ప్రపంచ దేశాలే తన వైపు తిరిగి చూస్తున్నాయని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ముధోల్ నియోజకవర్గం నుండి భాజపా ఎం.పి అభ్యర్థికి అత్యధిక మెజార్టీ అందించాలని, అదిలాబాద్ పార్లమెంట్ సీట్ నీ గెలిపించాలని కార్యకర్తలను కోరారు. ఈ బహిరంగ సభలో మణిపూర్ మంత్రి సుసింద్రీ, జాతీయ ఓబీసీ నాయకులు,రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, అదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు,బిజెపి ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్,పాయల్ శంకర్,హరీష్ పాల్వాయి, నిర్మల్ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్ రెడ్డి, పదాధికారులు, యాత్ర ప్రముఖులు, బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సభలో వివిధ గ్రామాల సర్పంచులు పార్టీలో చేరారు.

# దశాబ్దాలుగా వారసత్వ రాజకీయాల్లో మగ్గిన కాశ్మీర్

**ఆర్టికల్ 370 రద్దుతో రాష్ట్రంలో నవ్యపథం**
**అడ్డుగోడ తొలగడంతో పురోగామి దిశగా పయనం**
**దేశాభివృద్ధి అంటే..కాశ్మీర్ అభివృద్ధి కూడా**
**కాశ్మీర్‌లో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం**
**వారతస్వ రాజకీయాలపై ఘాటు విమర్శలు**
**370 ఆర్టికల్ సినిమాపై ప్రస్తావన**



జమ్మూ,ఫిబ్రవరి20 : దశాబ్దాల తరబడి వంశపారంపర్య రాజకీయాల భారాన్ని జమ్మూకశ్మీర్ భరించాల్సి వచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. ఆ రాజకీయ నేతలు వారి కుటుంబాల గురించి మాత్రమే ఆలోచించేవారని, అయితే ..ఇప్పుడు అలాంటి పరిస్థితుల నుంచి విముక్తి లభిస్తున్నందుకు సంతోషంగా ఉందని వ్యాఖ్యలు చేశారు. కొన్నేళ్లుగా జమ్ము కశ్మీర్‌ను ఎవరూ పట్టించుకోలేదని.. ఇవాళ ఇక్కడి నుంచి అభివృద్ధి పనుల్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మంగళవారం జమ్మూ నుంచి ఐఐటీ, ఐఐఎం, నవోదయ లాంటి విద్యాసంస్థలను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. జమ్ముకశ్మీర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. త్వరలో వికసిత్ కశ్మీర్‌కల సాకారం అవుతుంది. మోదీ గ్యారెంటీ అంటే ఇలా ఉంటుంది అని అన్నారు. అభివృద్ధి చెందిన భారత్ అంటే అభివృద్ధి చెందిన జమ్మూకశ్మీర్ కూడా అని తెలిపారు. గత పదేళ్లలో ఈ ప్రాంతంలో కొత్తగా 50 డిగ్రీ కళాశాలలు ఏర్పాటయ్యాయని వెల్లడించారు. అప్పట్లో పాఠశాలలకు నిప్పంటించేవారని, ఇప్పుడు అలంకరిస్తున్నారని అన్నారు. బాలీవుడ్ నటి యామీ గౌతమ్ నటించిన ఆర్టికల్ 370 గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు. మంగళవారం జమ్మూ పర్యటనకు వెళ్లిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో సంభాషించారు. అలాగే మౌలానా ఆజాద్ స్టేడియంలో నిర్వహించిన సభలోనూ ప్రసంగించారు. ఆర్టికల్ 370పై ఈ వారంలో ఒక సినిమా విడుదల కానుందని విన్నాను. అది మంచి విషయం. ప్రజలు వాస్తవాలు తెలుసుకునేందుకు ఆ చిత్రం ఉపకరించనుంది. జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ఆర్టికల్ 370 ప్రధానమైన అవరోధంగా ఉండేది. దానిని భాజపా తొలగించడంతో ఇప్పుడు ఈ ప్రాంతం సమతుల్యత దిశగా కదులుతోంది. దాని రద్దు తర్వాతే ఇక్కడి ప్రజలు రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయాన్ని పొందుతున్నారని మోదీ అన్నారు. అలాగే వారసత్వ రాజకీయాలపైనా విమర్శలు చేశారు. ఈ క్రమంలో జమ్మూ కశ్మీర్‌లో ఈరోజు 32 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభలో ప్రసంగిస్తూ కుటుంబ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్ అనేక దశాబ్దాలుగా రాజవంశ రాజకీయాల బాధితురాలిగా ఉందన్నారు. వంశపారంపర్య రాజకీయాలు చేస్తున్న వారు తమ ప్రయోజనాల కోసం మాత్రమే చూసుకున్నారు తప్ప మీ ప్రయోజనాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. వంశపారంపర్య రాజకీయాల వల్ల ఎక్కువగా నష్టపోయింది యువతేనని వెల్లడించారు. తమ కుటుంబం గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తులు మీ కుటుంబం గురించి చింతించరని చెప్పారు. ఆర్టికల్ 370ని ప్రధాని మోదీ గోడతో పోల్చారు. ఆ గోడను బీజేపీ ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. ఇప్పుడు జమ్మూ కాశ్మీర్ సమతుల్య అభివృద్ధి దిశగా కొనసాగుతోందన్నారు. ఈరోజు వందలాది మంది యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు అందజేశామని మోదీ గుర్తు చేశారు. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్ ఈ వంశపారంపర్య రాజకీయాల నుంచి విముక్తి లభిస్తుందన్న సంతృప్తి ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం భారీ కానుకలు అందించారు. సంగల్దాన్ స్టేషన్- బారాముల్లా స్టేషన్ మధ్య మొదటి ఎలక్ట్రిక్ రైలును ప్రధాని ప్రారంభించారు. బారాముల్లా-శ్రీనగర్-బనిహాల్-సంగల్దాన్ సెక్షన్ (185.66 కి.మీ) మధ్య కొత్త రైలు మార్గంతో సహా జమ్మూ, కాశ్మీర్‌లో వివిధ రైల్వే ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. ఎంఎ స్టేడియంలో పదేళ్ల క్రితం డిసెంబర్ 2013లో జమ్మూలోని ఇదే స్థలంలో లాల్కర్ ర్యాలీని ఉద్దేశించి ఇచ్చిన హామీలను గుర్తు చేశారు.

# మేడారంలో సందడేసందడి

**భారీగా తరలివస్తున్న భక్తులు**
**నేటినుంచి నాలుగురోజుల జాతర**
**పూనుగొండ్ల పగిడిద్దరాజు గుడిలో ప్రత్యేక పూజలు**
**గద్దెల వద్దకు బయలుదేరిన పగిడిద్దరాజు**
**భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం**





మహబూబాబాద్,ములుగు,ఫిబ్రవరి20: సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. వనదేవరుడు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును, ఆయన తనయుడు జంపన్నను మంగళవారం మేడారం తీసుకెళ్లేందుకు పూజారులు ఏర్పాట్లు చేశారు. గిరిజన సంప్రదాయాలు, శివసత్తుల పూనకాల మధ్య మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని దేవాలయం నుంచి పగిడిద్దరాజును, ములుగు జిల్లా కన్నెపల్లి నుంచి జంపన్నను మేడారం తీసుకెళ్లనున్నారు. బుధవారం నాడు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దె పైకి తీసుకురానున్న నేపథ్యంలో... అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అమ్మవార్లకు తులాభరంతో బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా వడిబియ్యం, చీర, సారెతో పూజలు చేశారు.భక్తులు పూనకాలతో పరవశిస్తు అమ్మవార్ల దీవెనల కోసం గద్దెల వద్దకు చేరుకుంటున్నారు మేడారం జనసందోహంతో ఆధ్యాత్మిక భక్తి భావనతో పులకించి పోతోంది. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం మండలం పూనుగొండ్లలో పగిడిద్దరాజు గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. పగిడిద్దరాజును తీసుకుని కోయ పూజారులు అటవీ మార్గంలో కాలినడకన మేడారంకు బయలుదేరి వెళ్లనున్నారు. రాత్రికి పగిడిద్దరాజు మేడారంకు రానున్నారు. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క - సారలమ్మ మేడారం జాతర ఈనెల 21 నుంచి నాలుగు రోజుల పాటు ఘనంగా జరుగనుంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేళ్లకోసారి జరుగుతుంది. జాతరకు ఒకరోజు ముందే పగిడిద్దరాజును మేడారంకు తీసుకువస్తారు. అనంతరం సారలమ్మ, గోవిందరాజును గ్దదెకు తీసుకువస్తారు. ఫిబ్రవరి 22న సమ్మక్క దేవతను గద్దెకు తీసుకువస్తారు. ఫిబ్రవరి 23న భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఫిబ్రవరి 24న దేవతల వనప్రవేశం ఉండగా... ఫిబ్రవరి 28వ జాతర పూజలు ముగింపు కార్యక్రమాలు ఉంటాయి.మంగళవారం ఉదయం పూనుగొండ్ల సమీపంలోని దేవుడి గుట్ట నుంచి పగిడిద్దరాజును తీసుకొచ్చి దేవాలయంలో ప్రతిష్ఠిస్తారు. శాంతి పూజా కార్యక్రమాల అనంతరం పెన్క వంశీయులు పడగ రూపంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా సిద్ధం చేసారు. ఆ పడగ రూపాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం పూనుగొండ్ల అడవుల నుంచి మేడారానికి కాలినడకన తీసుకెళ్లే కార్యక్రమం మొదలు పెట్టారు. పూజారి జగ్గారావుతోపాటు మరో పదిమంది పూజారులు, పలువురు భక్తులు పగడిద్దరాజు వెంట బయలు దేరుతారు. మధ్యలో గోవిందరావుపేట మండలం కర్లపల్లి లక్ష్మీపురం లోని పెన్క వంశీయుల వద్ద మంగళవారం రాత్రి విడిది కల్పిస్తారు. బుధవారం ఉదయాన్నే బయలుదేరి రాత్రి సారలమ్మ చేరుకునే సమయానికి పగిడిద్దరాజును మేడారం గద్దెకు చేరుస్తామని ప్రధాన పూజారులు చెప్పారు. సమ్మక్క తనయుడు, సారలమ్మ సోదరుడైన జంపన్నను కన్నెపల్లి నుంచి పోలెబోయిన వంశస్థులు మేడారం తీసుకు రానున్నారు. పూజారి పోలెబోయిన సత్యం ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మంగళవారం సాయంత్రం 5 గంటలకు కన్నెపల్లి నుంచి బయలుదేరి రాత్రి 7 గంటలకు మేడారానికి చేరుకుంటారు.

# లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ పై ఈసీ కసరత్తు..

## తేదీల ఖరారు ఎప్పుడంటే..?




హైదరాబాద్, ఫిబ్రవరి 20 ,ఎప్పెడెప్పుడా అని ఎదురుచూస్తున్న లోక్ సభ ఎన్నికలు 2024 త్వరలోనే జరుగబోతున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికల కోసం వరుస పర్యటనలు, ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో మార్చి 9 తర్వాత ఏ క్షణమైనా 2024 లోక్ సభ ఎన్నికలకు ఎన్నికల తేదీలను ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం ఉంది. 2024 ఏప్రిల్, మే నెలల్లో 18వ లోక్ సభ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. 2024 ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఇప్పటికే ఈసీఐ అధికారుల బృందం వివిధ రాష్ట్రాల్లో వరుసగా పర్యటిస్తోంది.జమ్మూకశ్మీర్ భద్రతా పరిస్థితి, బలగాల లభ్యత గురించి తెలుసుకోవడానికి ఈసీ అధికారులు మార్చి 8-9 మధ్య ప్రభుత్వ ప్రతినిధులను కలుస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లోక్ సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించవచ్చా లేదా అని తెలుసుకోవడానికి ఈ నెల 12,13 తేదీల్లో ఈసీ అధికారులు జమ్ముకశ్మీర్లో పర్యటించనున్నారు. అయితే చివరిసారిగా 2019 పార్లమెంట్ ఎన్నికల తేదీలను మార్చి 10న ప్రకటించగా, ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు ఏడు దశల్లో పోలింగ్ జరగ్గా, మే 23న ఓట్ల లెక్కింపు జరిగింది.అయితే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. ఇటీవలనే ప్రధాని నరేంద్ర మోడీ బీజేపీ నేతలు దిశానిర్దేశం చేస్తూ ఈ లోక్ సభ ఎన్నికల్లో ఏన్డీఏ 400 సీట్లు సాధించి మూడోసారి అధికారంలోకి రావాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మోడీ అయోధ్య రామమందిరం ప్రత్యేక ఎజెండా ఎత్తుకోబోతుండగా, కాంగ్రెస్ మాత్రం ఛలో ఢిల్లీ, మణిపూర్ అల్లర్లు, నిరుద్యోగ సమస్యలను ప్రస్తావిస్తూ జనాల్లో వెళ్లే అవకాశం ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల ముందు ఇండియా కూటమికి వరుసగా షాకులు తగులుతుండటం ఆ నేతలకు మింగుడు పడటం లేదు.ఇక ప్రపంచ నాయకులలో ప్రధాని నరేంద్ర మోడీ విజయవంతమైన నాయకుడు అని , ఇతరులకు భిన్నంగా నిలిచారని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. ఉత్తర్ ప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా వచ్చిన పెట్టుబడుల ప్రతిపాదనలకు లక్నోలో జరిగిన భూమిపూజ కార్యక్రమంలో రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వం, మార్గదర్శకత్వంలో యావత్ భారతదేశం పురోగతి సాధిస్తోందన్నారు.

# కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో తెలంగాణ సీఎం రేవంత్ భేటీ

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారులు అభివృద్ధి, రాష్ట్రీయ రహదారులను జాతీయ రహదారులుగా గుర్తింపు సహా పలు కీలక అంశాలపై చర్చించారు.తెలంగాణలోని 15 రాష్ట్రీయ రహదారులను జాతీయ రహదారులుగా అప్ గ్రేడ్ చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరా బాద్ ? శ్రీశైలం ఫోర్ లైన్ ఎలివేటెడ్ కారిడార్, హైదరాబాద్ ? కల్వకుర్తి రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయడం, రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం అభివృద్ధి, హైదరాబాద్ ? విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించడంపై గడ్కరీతో రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి చర్చించారు. సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ నుండి తెలంగాణకు నిధుల కేటాయింపు పెంచాలని విజ్ఞప్తి చేశారు.నల్గొండలో ట్రాన్స్‌పోర్ట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని, నల్గొండ పట్టణానికి బైపాస్ రోడ్డు మంజూరు చేయాలని నితిన్ గడ్కరీకి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు.



# సంపాదకీయం

బుధవారం 21-02-2024

## కామన్ సివిల్ కోడ్ దిశగా అడుగులు

ఏదిఏమైనా ఉమ్మడి పౌరస్మృతి అనే దానిని మన దేశంలో అమలు చేయాలి అనేది బిజెపి చిరకాల వాంఛ. దానిని సాకరమయ్యే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. బిజెపి ఎంతో కాలంగా కలలు కంటున్న ముఖ్యమైన లక్ష్యాలను గత పదేళ్ళలో చాలా వరకు నెరవేర్చుకో గలిగింది. ముఖ్యంగా ఇటీవల అయోధ్యలో రామాలయం నిర్మాణం పూర్తికావడంతో బిజెపి మంచి జోరుమీద ఉంది. ఇప్పటికే కశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణాన్ని మోడీ ప్రభుత్వం రద్దు చేసి ఘన విజయం సాధించింది. ఇప్పుడు ఉత్తరాఖండ్‌లోని బిజెపి ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతిని ఆమోదిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ ఉమ్మడి పౌరస్మృతిని ఆమోదించిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ చరిత్రను సృష్టించింది. ఈ చట్టం ద్వారా స్త్రీ, పురుష భేదం లేకుండా అందరూ సమానులేనని రుజువు చేయడమే ఉమ్మడి పౌరస్మృతి లక్ష్యం అని ప్రకటించింది. మానవ జీవన ప్రయాణంలో కుటుంబ జీవితం ఒక ప్రధాన ఘట్టం. దానిలో వివాహం, విడాకులు, దత్తత మొదలైన పౌరజీవితాన్ని ప్రభావితం చేసే వ్యవహారాలలో ఈ ఉమ్మడి పౌరస్మృతి అనే చట్టం కీలకం కానున్నది. ఇప్పటికే ఈ తరహా చట్టాన్ని అమలు చేసేందుకు అసోం, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ప్రత్యేక ఆసక్తిని చూపిస్తున్నాయి. ఇవి అన్నీ బిజెపి పాలిత రాష్ట్రాలే కావడంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా బిజెపి ఆధీనంలో ఉంది కనుక దీనిని అమలు చేయడంలో పెద్దగా ఆటంకాలు అంటూ ఏమీ ఎదురుకావు. ఈ చట్టం ప్రకారం సహజీవనం సాగిస్తున్న జంటలుకూడా వెంటనే తమ బంధాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అనే నిబంధనను ఈచట్టంలో చేర్చారు. ఒకవేళ ఎవరైనా అలా చేయించుకోకపోతే వారు చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారు. మూడు నెలలపాటు సహజీవనం చేసిన జంట తమ డిక్లరేషన్ తప్పక ఇవ్వాల్సిందే. లేకపోతే వారికి మూడు నెలలు జైలు శిక్షపడుతుంది. ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదించిన ఈ బిల్లులో గిరిజనులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ సహజీవనం చేసుకున్న వారికి పుట్టిన పిల్లలకు, వారి సంతనానికి సమాన హక్కులు ఉంటాయి. ఈ చట్టం ద్వారా మహిళలకు రక్షణ లభిస్తుంది. ఇంతకు ముందు 'గోవా' ప్రాంతం పోర్చుగీస్ పాలనలో ఉన్నప్పుడు ఇలాంటి చట్టం అమలు లో ఉండేది. ఈ చట్టం అమలైతే బాల్యవివాహాలు రద్దు అవుతాయి. ఇప్పటికే అరేబియా, ఇండోనేషియా, జర్మనీ, జపాన్, మొదలైన దేశాల్లో కూడా ఇలాంటి చట్టం అమలులో ఉంది. ఈ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత మహిళలకు పూర్తి భద్రత లభిస్తుంది. ముఖ్యంగా సహజీవనం పేరిట జరిగే మోసాలకు పరిష్కారం లభిస్తుంది. పాశ్చాత్య దేశాల ప్రభావంతో వివాహం కాకుండానే కొంతకాలం ఇష్టపూర్వకంగా సహజీవనం చేయడం కలతలు, విభేధాలు రాగానే వెంటనే విడిపోయి, ఎవరికి వారు స్వతంత్రంగా బతకటం మామూలైపోయింది. ఈ నేపథ్యంలో ఎక్కువగా నలిగిపోతున్నది మహిళలు వారికి కలిగిన సంతానం. సమాజపరంగా అనేక అవమానాలను వారు ఎదుర్కొంటున్నారు. ఈ కష్టకాలంలో వారికి ఏ విధమైన చట్టపరమైన రక్షణ గానీ, తమ కుటుంబ బంధుమిత్రుల నుండి ఆదరణగానీ వారికి దొరకటం లేదు. ఇలాంటి సమస్యలతో సతమతమయ్యే మహిళలకు ఈ చట్టం రక్షణ కవచంలా పని చేస్తుంది. అలాగే ముస్లిం సమాజంలో ఉన్న మహిళలు 'త్రిపుల్ తలాక్'తో అనేక వివక్షలను ఎదుర్కొంటున్నారు. అందువల్ల 'త్రిపుల్ తలాక్' చట్టం రద్దు చేయటం ద్వారా మహిళల పట్ల వివక్ష లేకుండాచేశారు. ముస్లిం సంప్రదాయంలో ఇది భాగమంటూ చాలా కాలం దీనిని ఇస్లాం మతపెద్దలు కొందరు, లౌకికవాదుల పేరిట కొందరు చాలా కాలం అడ్డుకున్నారు. అయితే, ఇది పూర్తిగా మతపరమైన సమస్య మాత్రమే కాదు మొత్తంగా ముస్లిం మహిళల అందరి సామాజిక సమస్య. ఇంతకాలం ఈ 'త్రిపుల్ తలాక్' అనేది పురుషులకు మాత్రమే ప్రయోజనకరంగా ఉండేది. ఎలాంటి లింగ వివక్షత ఉండరాదు అని ఇప్పటికే అనేక మహిళా సంక్షేమ సంఘాలు దశాబ్దాలుగా దేశవిదేశాలలో పోరాటాలు చేశారు. అందుకే ముస్లిం మహిళలకు రక్షణ కల్పంచే ఉద్దేశంతోనే 'త్రిపుల్ తలాక్'ను రద్దు చేస్తున్నామని భారత ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో స్పష్టం చేశారు. 'ఉమ్మడి పౌర స్మృతి' ని చాలా కాలం అనేక మంది అనేక కారణాలతో ఆచరణ సాధ్యం కాకుండా అడ్డుకున్నారు. ఇప్పటికీ కొంతమంది అడ్డుకుంటున్నారు కూడా. దీని వల్ల మహిళలు నష్టపోతున్నారు. సమాన అవకాశాలూ, హక్కులను కోల్పోతున్నారు. మహిళలకు ఉద్యోగాల్లో, విశ్వవిద్యాలయాలో, విద్యా సంస్థల్లో ఇప్పటికే సమాన అవకాశాలు లభిస్తున్నాయి. వీటిని ఇంకా విస్తృత పరిచేందుకు 'ఉమ్మడి పౌరస్మృతి' ఎంతో ఉపయోగపడుతుంది. ఉత్తరాఖండ్‌లో 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఉమ్మడి పౌరస్మృతిపై ప్రజలకు వాగ్దానం చేసింది. రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి 'పుష్కర్ సింగ్ దామి' ఈ బిల్లు అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి రంజనా పి.దేశాయ్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీ రెండేళ్ళు పాటు కసరత్తు చేసింది. సంబంధిత వర్గాలతో అనేక సార్లు చర్చల తర్వాత ఆ కమిటీ తన సిఫారసులను ప్రభుత్వానికి అందజేసింది. ఈ సిఫారసుల్లో కుల, మతాలతో నిమిత్తం లేకుండా మహిళలందరికీ ఒకే తరహా చట్టాలు వర్తిస్తాయి. ఆస్తి, వారసత్వ చట్టాల్లో కూడా సమానత్వ హక్కు ఉంటుంది. లోక్‌సభ ఎన్నికల ముందు ఉత్తరాఖండ్‌లో బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకుని రావడం తో తమ పార్టీ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే, దేశమంతటా ఇలాంటి చట్టాన్ని తీసుకు వస్తామని ఎన్నికల ప్రచారంలో బిజెపి నాయకులు ప్రజలకు వాగ్దానం చేయాలని నిర్ణయించుకున్నారు. రాజ్యసభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంలో తమ పార్టీకి దరిదాపుల్లోకి కూడా కాంగ్రెస్ చేరుకోలేదు అనే భరోసాతో ఉన్నారు. అందుకు తగినట్లుగానే 'ఇండియా' కూటమి కూడా బలహీనపడుతుంది. వారిలో ఐక్యత లోపించింది. ప్రజా సమస్యలపై 'కామన్ ఎజెండా'ను ఇంకా రూపొందించుకోలేదు.

# వచ్చే వేసవి కాలంలో.... త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి.. జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా...

జగిత్యాల,ఫిబ్రవరి 20(లోకంతీరు):రాబోయే వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజున ఐడిఓసి సమావేశ మందిరంలో ధర్మపురి నియోజకవర్గానికి సంబంధించిన అధికారులతో త్రాగునీరు, వైద్య ఆరోగం, వ్యవసాయం, తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రజలకు త్రాగునీటి ఎద్దడి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలతో నీటి సరఫరా అందిచే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఏయే ప్రాంతాలలో నీటి సమస్యలు ఉంటుందో ఆయా ప్రాంతాలలో అవసరమైన బోరు బావులు అద్దెపై ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మిషన్ భాగీరథ పైపులైన్ లీకేజిలను సవరించుకుంటూ ప్రతీ ఇంటికి నీటి సరఫరా జరిగే విధంగా చూడాలని అన్నారు. బల్క్ నీటినీ ఆయా ట్యాంకులకు చేరే విధంగా ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాలలో బోర్లకు మరమ్మతులు చేయించాలని అవసరమైన పక్షంలో త్రాగునీటిని ఆయా బోర్ల నుండి సరఫరా చేసుకునేందుకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 78 గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు స్థానిక ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యపై కలెక్టర్




స్పందించి ఆయా ప్రాంతాలలో త్రాగు నీటి సరఫరా జరిగే విధంగా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మిడ్ మానేరు, ఎస్సారెస్పీల నుండి సరఫరా అయ్యే త్రాగునీటికి ఆయా సోర్స్ లలో నీటి సామర్థ్యాన్ని మెయింటేన్ చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వచ్చే వేసవి కాలం నాటికి కావలసిన నీటినీ లెక్కిస్తూ సోర్స్ సామర్థ్యాన్ని నిల్వ చేయాలని అన్నారు. అనంతరం వైద్య ఆరోగ్యం పై సమీక్షిస్తూ ధర్మపురి కమ్యూనిటి ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అన్నారు. 30 పడకలు గల ఆసుపత్రిలో 12 మంది డాక్టర్లు డిప్యూటేషన్ పై పనిచేస్తున్నారని, ఇంకా సివిల్ పనులు నిర్వహిస్తున్నట్లు, అవసరమియన్ ఎక్విప్ మెంట్ కోసం కమిషనర్ కార్యాలయంకు లేఖలు రాయడం జరిగిందని జిల్లా ప్రధాన ఆసుపత్రి వైద్యురాలు సుదీక్షణ వివరించగా, ఎక్విప్ మెంట్ సంబంధించిన లేఖలు తమకు అందజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. 50 పడకలు గల మాతా శిశు ఆసుపత్రి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, బిల్లులు చెల్లింపులు కావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కొత్తగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. సబ్ సెంటర్ల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తీ చేయాలని అన్నారు. లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా నిర్మాణ పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులకు కావలసిన ఎక్విప్ మెంట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, పల్లె దవాఖాన, బస్తీ దవాఖానకు కావాల్సిన పరికరాలు, ప్రహరి గోడ నిర్మాణ పనులకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని, ఇప్పటికే మంజూరైన పనులను ఎన్నికల నోటిఫికేషన్ కు ముందే ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ఎం.పి.డి.ఓ.లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో రుణాల పంపిణీ జరగాలి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో కలెక్టర్ హితవు

నిజామాబాద్, ఫిబ్రవరి 20 (లోకంతీరు): ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ప్రత్యేకించి నిజామాబాద్ జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతమైనందున పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశం జరిగింది. గత ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి గురించి బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి 4062.20 కోట్ల రూపాయలరుణాలు అందించాలని లక్ష్యం కాగా, గత డిసెంబర్ నెల ముగిసే నాటికి రూ. 2578.40 కోట్లను పంపిణీ చేసి 63.48 శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ రావు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇందులో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రూ. 2437 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం కాగా, రూ. 1801.72 కోట్ల రుణాలు అందజేయడం ద్వారా 73.94 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. అదేవిధంగా, ప్రస్తుత రబీ సీజన్లో రూ. 1625.20 కోట్ల పంట రుణాలుఅందించాల్సి ఉందని, డిసెంబర్31 నాటికి రూ. 776.78 కోట్లు పంపిణీ చేశామని, మర్చి నెలాఖరు నాటికి లక్ష్య సాధన పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని అన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ, నూటికి నూరు శాతం లక్ష్య సాధనపై దృష్టి సారించాలని హితవు పలికారు. గడిచిన






2022 – 23 ఆర్థిక సంవత్సరంలోనూ నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 71.72 శాతం మేర రుణాలు మాత్రమే పంపిణీ చేశారని అన్నారు. పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా, మరికొన్ని బ్యాంకులు నిస్తేజ వైఖరిని ప్రదర్శిస్తున్నాయని, ఈ ధోరణిలో మార్పు రావాలన్నారు. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడిని రుణాల రూపేణా బ్యాంకర్లు అందించకపోతే రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని,అలాంటి పరిస్థితిఉత్పన్నంకాకుండా వ్యవసాయరంగానికి విరివిగా రుణాలు అందించేందుకు బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. పోడు పట్టాలు పొందిన రైతులకుకూడా పంట రుణాలు అందించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పూర్తి స్థాయిలో లింకేజీ రుణాలు పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయవద్దని సూచించారు. ముద్ర రుణాలతో పాటు స్టాండ్ అప్ ఇండియా కింద విరివిగా రుణాలు అందించాలన్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసుకునే చేతివృత్తుల వారికి సత్వరమే రుణ సదుపాయం కల్పించాలని అన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో అందిస్తున్న శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న కోసం రుణాలు అందించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.బి.ఐ డీజీఎం అనిల్ కుమార్, నాబార్డు డీడీఎం ప్రవీణ్ కుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, మెప్మా పీ.డీ రాజేందర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

# నేడు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం




మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలి బడి. తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఎలా పిలుస్తాడో.. మాతృభాష కూడా అంతే. మాతృభాష సహజంగా అబ్బుతుంది. అప్రయత్నంగా వస్తుంది. అమ్మ మాటే మాతృభాష. అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి. మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది. యునెస్కో 1999 ఫిబ్రవరి 21 న అంతర్జాతీయ మాతృభాష దినంగా ప్రకటించింది. 2000 ఫిబ్రవరి 21 నుండి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు ) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా ప్రతి ఏట ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. 1947 లో భారత దేశం, పాకిస్తాన్ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్ రెండు భౌగోళికంగా వేర్వేరు భాగాలు ఏర్పడింది. ఒకటి తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్ అని పిలుస్తారు) రెండవది పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుతం పాకిస్తాన్ అని పిలుస్తారు). సంస్కృతి, భాష మొదలైన వాటిలో రెండు ఒకదానికొకటి చాలా భిన్నంగా ఉండేవి. ఈ రెండు భాగాలను భారతదేశం వేరు చేసింది. తూర్పు పాకిస్తాన్ (ఇప్పుడు బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్తాన్ (ఇప్పుడు పాకిస్తాన్ ) కలిపి మెజారిటీ ప్రజలు బెంగాలీ లేదా బంగ్లా భాష ఎక్కువగా మాట్లాడేవారు. 1948 లో అప్పటి పాకిస్తాన్ ప్రభుత్వం ఉర్దూను పాకిస్తాన్ జాతీయ భాషగా ప్రకటించింది. దీనికి తూర్పు పాకిస్తాన్ ప్రజలు అభ్యంతరం తెలిపారు. తూర్పు పాకిస్తాన్ జనాభాలో ఎక్కువ భాగం బెంగాలీ మాట్లాడతారు. ఉర్దూతో పాటు బెంగాలీ కూడా జాతీయ భాషలలో ఒకటిగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను తూర్పు పాకిస్థాన్‌కు చెందిన ధీరేంద్రనాథ్ దత్తా 1948 ఫిబ్రవరి 23 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో లేవనెత్తారు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు (ప్రస్తుతం బంగ్లాదేశ్) నిరసనలు చేపట్టారు. భాష సమాన హోదా కోసం ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి పాకిస్థాన్ ప్రభుత్వం 144 సెక్షన్, ర్యాలీలు, మొదలైనవి ఢాకా నగరంలో నిషేధించింది. ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు, సాధారణ ప్రజల సహకారంతో భారీ ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేశారు. 1952 ఫిబ్రవరి 21 న ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సలాం, బర్కాట్, రఫీక్, జబ్బర్, షఫియూర్ మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. చరిత్రలో ఇది చాలా అరుదైన సంఘటన, ప్రజలు తమ మాతృభాష కోసం ప్రాణాలను అర్పించారు. పోలీసుల దాడికి నిరసనగా ముస్లిం లీగ్ అదే రోజు పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేశారు. ఉద్యమం పెరుగుతున్న నేపథ్యంలో, పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం చివరకు దిగి వచ్చింది. 1954 మే 8 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో బెంగాలీని రాష్ట్ర భాషలలో ఒకటిగా స్వీకరించారు. 1956 లో పాకిస్తాన్ మొదటి రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు, ఆర్టికల్ 214 లో బెంగాలీ ఉర్దూలను పాకిస్తాన్ రాష్ట్ర భాషలుగా పేర్కొంది. 1971 లో బంగ్లాదేశ్ స్వతంత్రమైనప్పుడు, బెంగాలీ ఏకైక రాష్ట్ర భాషగా ప్రవేశపెట్టబడింది. యునెస్కో బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పురస్కరించుకుని 1999 ఫిబ్రవరి 21, న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ప్రకటించింది.

## సీనియర్ జర్నలిస్ట్ నేలంటి మధు కు రాష్ట్ర స్థాయి ఉత్తమ పాత్రికేయ పురస్కారం

హైదరాబాద్ ఫిబ్రవరి 20;: ప్రముఖ సేవా సంస్థ" అస్తిత్వం" సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకులు నేలంటి మధు కు 2024 ఉత్తమరాష్ట్ర స్థాయి పాత్రికేయ పురస్కారం ప్రకటించింది. ఫిబ్రవరి 21 వ తేదీన హైదరాబాద్ లోని

రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డ్ అందజేయనున్నట్లు సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జ్, సెక్రెటరీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ శ్రీమతి జి. కళార్చన , గౌరవ అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరి కృష్ణ హాజరు కానున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

## రామారెడ్డి మండల ఎంపీపీ కి హైకోర్టు స్టే ఊరట..!

### - ఎంపీపీ దశరథ్ రెడ్డి అవిశ్వాసం పై హైకోర్టు స్టే



కామారెడ్డి జిల్లారామారెడ్డి ( ఫిబ్రవరి 20) లోకం తీరు కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి పై ఈనెల 9న ఏడుగురు ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానం పై హైకోర్టు స్టే విధించినట్టు ఎంపీపీ దశరథ్ రెడ్డి తెలిపారు. హైకోర్టు విధించిన స్టే కాపీని మంగళవారం కామారెడ్డి ఆర్డిఓ వై రంగనాథ్ కు స్టే కాపీని అందజేశారు. ఈనెల 9న ఎంపీపీ పై అవిశ్వాసం తీర్మానం పై ఏడుగురు ఎంపీటీసీలు సంతకాలు చేసి కామారెడ్డి ఆర్డీవోకు అందజేశారు. ఆర్డీవో మార్చి ఆరో తేదీ న అవిశ్వాసం పై సమావేశం నిర్వహిస్తూ ఆర్డీవో నోటీసులు అందజేశారు. ఈ నోటిసు పై స్పందిస్తూ ఎంపీపీ దశరథ్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీన్ని పరిశీలించిన కోర్టు స్టే విధించింది. స్టే వలన ఊరట కలిగింది. దీంతో ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నాయకులు దశరథ్ రెడ్డి అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## మేడారం మహా జాతరకు పర్యాటక శాఖ సకల ఏర్పాట్లు

మేడారంహైదరాబాద్ నుంచి మేడారం వరకు వీ.ఐ.పీ దర్శనంతో హెలికాప్టర్ సర్వీసులు ఏర్పాటుజాతర కు వచ్చే వివిఐపి, వీఐపీలకు , హరిత హోటల్ లో ఏర్పాట్లు చేశారుఆదివాసి ఛాయా చిత్ర ప్రదర్శన, పర్యాటక సమాచార కేంద్రం ఏర్పాటుమేడారం మహా జాతరకు పర్యాటక శాఖ తరపున సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే కుంభమేళా వంటి మేడారం మహా జాతర లో పర్యాటక శాఖ తరఫున అనేక ఏర్పాట్లు చేయనైనది. మేడారం మహా జాతర సందర్భంగా హైదరాబాద్ నుంచి మేడారం వరకు విఐపి దర్శనం చేయించి, మళ్ళీ హైదరాబాద్ లో దించే హెలికాప్టర్ సర్వీసులను భక్తుల సౌకర్యార్థం పర్యాటకశాఖ ఏర్పాటు చేయడం జరిగింది. దేశంలో ఈ స్థాయిలో జరిగే మరే జాతరలో కూడా ఇలాంటి హెలికాప్టర్ సర్వీసులు లేవని, మేడారం జాతరలో మాత్రం ఐదవ సారి సైతం హెలికాప్టర్ సేవలను ఏర్పాటు చేశారు.

## భూంపల్లి గ్రామంలో మాల మహానాడు నూతన సంఘం ఏర్పాటు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 20 (లోకం తీరు)కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలంలోని భూంపల్లి గ్రామంలో మాల మహానాడు నూతన సంఘం ఏర్పాటు చేయడం జరిగిందని అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామంలో మాల మహానాడు సంఘం ఏర్పాటు చేయడానికి 100 మంది కమిటీతో మాల మహానాడు కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు అధ్యక్షుడిగా మొగ్గం రాజేందర్ ఉపాధ్యక్షుడిగా సుంకరి నర్సింలు ప్రధాన కార్యదర్శి సుంకరి రాజు కోశాదికారి గైని భాస్కర్ కార్యదర్శి మొగ్గం బాలరాజు సలహాదారుడు గౌరవ అధ్యక్షులు మాజీ ఎంపీపీ గైని నాగేశ్వర్ ను నియమించారు మాల మహానాడు కమిటీలో 94 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్ష కార్యదర్శులు తెలిపారు ఈ కార్యక్రమంలో మహానాడు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 28 నుండి ఇంటర్ పరీక్షలు..

### పకడ్బందీగా ఏర్పాట్లు..అదనపు కలెక్టర్..



జగిత్యాల ఫిబ్రవరి ,20(లోకంతీరు):ఈ నెల 28 నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయని,పరీక్షల నిర్వహణ పకడ్బందీగా, ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి.ఎస్.లత అన్నారు. మంగళవారం రోజున ఐడిఓసి సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరాల వార్షిక పరీక్షల నిర్వహణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షలు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు 14,542 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నరని, ఇందులో 12400 మంది జనరల్, 2142 వొకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. మొదటి సంవత్సరంలో 5717, రెండవ సంవత్సరంలో 6683 మంది,వొకేషనల్ కోర్సులో మొదటి సంవత్సరంలో 949, రెండవ సంవత్సరంలో 1193 మంది పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, ప్రతీ కేంద్రంలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేయాలని, 144 సెక్షన్ విధించాలని, పరీక్ష సమయంలో జీరాక్స్ కేంద్రాలను మూసివేయాలని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పోలీసు బందో బస్తు ఏర్పాటుచేయాలనీ, పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అగ్నిమాపక ప్రమాదాలు జరుగకుండా ముందస్తు ఏర్పాట్లు పరిశీలించాలని అగ్ని మాపక శాఖ అధికారులను ఆదేశించారు. ఇన్విజిలేటర్ ల కోసం అవసరమైన ఉపాధ్యాయులను డిప్యూట్ చేయాలని విద్య శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే వారంలోగా విద్యార్థులను పరీక్షలకు సంసిద్దులుగా చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు సమయానికి ముందే ఆర్టీసి బస్సులను రీ షెడ్యూల్ చేయాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం లో జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి నారాయణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో నడవాలి...

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్...

ఆదిలాబాద్ ఫిబ్రవరి 20(లోకంతీరు) : సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ,రామారావు మహారాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు.ప్రతి ఒక్కరూ చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం లంబాడాల అభివృద్ధి అన్ని విధాలుగా కృషి చేస్తుందని పేర్కొన్నారు.ప్రతి యేటా సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందన్నారు.దేశంలో ఎక్కడ లేని విధంగా లంబాడాలు వరకట్నం తీసుకుంటున్నారని అన్నారు.ఈ వరకట్నంను బ్యాన్ చేయాలని అన్నారు.లంబాడాలు ఎదురుకుంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చెపడతామన్నారు.అనంతరం సేవాలాల్ జయంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలు వాతో సత్కరించారు.



# అట్టహాసంగా కేంద్రీయ విద్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం

### వర్చువల్ ద్వారా ప్రారంభోత్సవం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

నిజామాబాద్, ఫిబ్రవరి 20 (లోకంతీరు): నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో మినీ ట్యాంక్ బండ్ ను అనుకుని నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసపు ఏర్పాట్ల నడుమ మంగళవారం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జమ్మూలోని ఐ.ఐ.ఎం నుండి వర్చువల్ విధానం ద్వారా కేంద్రీయ విద్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేయగా, నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, అర్బన్ శాసన సభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు ఈ సంరంభంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి అరవింద్ మాట్లాడుతూ, ఎంతో ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విద్యాలయాలను ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశమంతటా విస్తరిస్తోందన్నారు. 2014 వరకు రాష్ట్రంలో కేవలం హైదరాబాద్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాలలోనే కేంద్రీయ విద్యాలయాలు ఉండేవని అన్నారు. ప్రస్తుతం ప్రతి జిల్లా కేంద్రంతో పాటు బోధన్, మిర్యాలగూడ, మహబూబాబాద్, సిరిసిల్ల వంటి అనేక పట్టణాల్లోనూ కేంద్రీయ విద్యాలయాలు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. నిజామాబాద్ లో 7.5 ఎకరాల విస్తీర్ణంలో రూ. 28 కోట్లు వెచ్చిస్తూ అన్ని వసతులతో కేంద్రీయ విద్యాలయ నూతన భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. పదవ తరగతి వరకు కొనసాగుతున్న ఈ విద్యా సంస్థలో, త్వరలోనే 12వ తరగతి వరకు అప్ గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బోధన్ పట్టణంలోని కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణం పనులను కూడా మరింత వేగవంతం చేసి వచ్చే ఏడాది నుండి సొంత భవనం అందుబాటులోకి తెస్తామన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయానికి ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో అన్ని వసతులతో కూడిన నూతన భవనం అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న కేంద్రీయ విద్యాలయాల ద్వారా నాణ్యమైన విద్య అందుతోందని అన్నారు. అయితే, నేటి రోజుల్లో అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కేవలం మార్కులు, ర్యాంకుల కోసం ఒత్తిడి చేస్తున్న పరిస్థితి నెలకొందని కలెక్టర్ ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పిల్లలు మానసిక వికాసాన్ని



పెంపొందించుకోలేకపోతున్నారని, సమాజంలో మన చుట్టూ జరిగే పరిస్థితులను ఆకళింపు చేసుకోవడం లేదని అభిప్రాయపడ్డారు. మానసిక దృఢత్వం కలిగి ఉంటే, జీవితంలో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల దిశగా కూడా ప్రోత్సహిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు సరైన బాటలువేయాలని కలెక్టర్ హితవు పలికారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, కేంద్రీయ విద్యాలయాలలో చదువుకున్న వారు దేశభక్తిని పుణికిపుచ్చుకుంటారని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని బోధకులకు సూచించారు. కేంద్రీయ విద్యాలయం ఆవరణలో చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు అవసరమైన నిధులను సొంతంగా తాను సమకూరుస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ సంస్థల హైదరాబాద్ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కార్పోరేటర్ మమత, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కేంద్రీయ విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరింపజేశాయి

# పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ఎస్ఐ

నిజామాబాద్ ,ఫిబ్రవరి 20(లోకంతీరు):రక్షించాల్సిన రక్షక భటుడు మహిళా భక్షకుడు అయ్యాడు. కాపాడండి అని స్టేషన్ కొచ్చిన యువతిని పెళ్లి చేసుకుంటాను అని లొంగబరుచుకొని మోసం చేసిన వైనం చివరికి?దీంతో బాధిత యువతి మోసపోయానని గ్రహించి సైదాబాద్ పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేశారు.ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన ఎస్సైని సైదాబాద్ పోలీసులు అరెస్టు చేశారు.నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ గిరిజన యువతి నగరంలో జూనియర్ ఆర్టిస్ట్?గా పనిచేస్తూ సైదాబాద్ పీఎస్ పరిధిలోని తన అత్త ఇంట్లో ఉంటోంది. గతేడాది జనవరిలో అత్త, మామల మధ్య జరిగిన గొడవ కారణంగా ఫిర్యాదు చేసేందుకు సైదాబాద్ పోలీస్ స్టేషన్?కు వెళ్లింది.ఆ సమయంలో ట్రైనీ ఎస్సైగా ఉన్న నిజామాబాద్‌కు చెందిన పబ్బా అరుణ్(29) క్రమంగా ఆ యువతితో పరిచయం పెంచుకున్నాడు.ఫోన్ నంబరు తీసుకొని తరచూ వాట్సాప్?లో టచ్‌లో ఉంటూ ప్రేమాయణం నడిపాడు.ప్రేమిస్తున్నాన ని, పెళ్లి చేసుకుంటానని ఆ యువతిని నమ్మించి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఆరునెలల క్రితం సదరు యువతి అరుణ్ ఫోన్‌లో అతడికి మరో అమ్మాయితో నిశ్చితార్థం అయిన ఫొటోలను చూసి నిలదీసింది.ఆ నిశ్చితార్థాన్ని రద్దు పెళ్లి చేసుకుంటానని అరుణ్ నమ్మబలికాడు. ఆ తర్వాత నెలల గడుస్తున్నా అరుణ్ పెళ్లి ప్రస్తావన వాయిదా వేస్తుండడంతో యువతి అరుణ్ నిశ్చితార్థం



చేసుకున్న అమ్మాయి సోదరుడికి ఫోన్ చేసి తమ సంబంధం గురించి చెప్పింది.ఈ క్రమంలో అరుణ్ యువతికి ఫోన్ చేసి పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పడంతో బాధితురాలు సైదాబాద్ పోలీసులను ఆశ్రయించింది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని.. ప్రస్తుతం సిద్దిపేట కమిషనరేట్ వీఆర్‌లో పనిచేస్తున్న



ఎస్సై అరుణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.బాధిత అమ్మాయి స్టేట్మెంట్?ను మరోసారి తీసుకొని ఎస్సై అరుణ్?ని విచారిస్తున్నారు. వాట్సాప్, కాల్స్ డేటా వీటన్నింటినీ సైదాబాద్ పోలీసులు పరిశీలిస్తున్నారు. పోలీసు డిపార్ట్మెంట్?లో ఉండి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం పట్ల పోలీసు శాఖపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# కాల్వ కొరకు సంబంధించిన రైతుల భూముల రికార్డులను సవరించండి

- భూమికి బదులు భూమి కల్పించండి
- ఎకరం భూమికి 30 లక్షల పరిహారం చెల్లించాలి
- ప్రభుత్వా నిబంధనల ప్రకారం పరిహారం తో నష్టపోతున్నాం
- గ్రామ సభలో స్పెషల్ ఆఫీసర్ ఆర్డిఓ కి వినతి పత్రం అందజేత



కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 20 (లోకం తీరు)కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం భూంపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ సభకు వచ్చిన ఆర్డిఓ వై రంగనాథం ను కలిసి రైతులు తమ భూములు రికార్డులోకి ఎక్కించాలని విజ్ఞప్తి చేశారు. బొంపల్లి పెద్ద చెరువు ద్వారా లిఫ్ట్ ఏర్పాటు చేయడానికి తమ గ్రామ రైతులకు అన్యాయం జరిగిందని వెంటనే రికార్డులను సరిచేయాలని మాజీ జెడ్పిటిసి పడిగేల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు గతంలో 20 గుంటల భూమి కాలేశ్వరం కాల్వలకు పోతే 40 గుంటలు రికార్డు నుంచి తొలగించారని గత మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగిన ఎలాంటి ఫలితం దక్కలేదని వారు ఆరోపించారు. అదే భూములు ప్రభుత్వానికి అవసరమైతే రికార్డులు లేకున్నా తిరిగి రికార్డులకు ఎక్కించి రైతుల సమస్యలను తీర్చాలని అన్నారు. గ్రామ సభ లో గ్రామానికి చెందిన 29 మంది రైతులకు చెందిన భూములను రికార్డుల నుంచి రెండుసార్లు తొలగించారని దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గతంలోని జిల్లా కలెక్టర్లకు విన్నవించామని అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తిరిగి తమ భూములను న్యాయంగా తమ పేరు రికార్డుకు ఎక్కించాలని రైతులు కోరారు. అందుకు స్పందించిన ఆర్డీవో మీరు ఇచ్చిన దరఖాస్తులు పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామసభలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి తొమ్మిది లక్షల 50 వేల 175 రూపాయలు ప్రభుత్వపరంగా నష్టపరిహారం వస్తదన్నారు. అయితే తమకు భూములకు బదులుగా భూములను కొనుగోలు చేసి ఇవ్వాలని రైతుల డిమాండ్ చేశారు. లేదంటే ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఎకరాల 30 లక్షలు చెల్లించాలని రైతుల డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మార్వో గంగాసాగర్, ఇరిగేషన్ రెవిన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు. చట్ట ప్రకారం 9: 50 లక్షల కంటే ఎక్కువ ఇవ్వరాదని మీ డిమాండ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.



### తడి చెత్త సేకరణపై దృష్టి సారించాలి.డిఎల్పిఓ సాయిబాబా.





బాన్సువాడ/కోటగిరి ,ఫిబ్రవరి 20( లోకంతీరు): గ్రామాలలో తడి చెత్త సేకరణపై దృష్టి సారించాలని బోధన్ డిఎల్పిఓ సాయిబాబా గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు.మంగళవారం పోతంగల్ మండలంలో మండల పరిధిలోని జిల్లాపల్లి,జల్లాపల్లి ఫారం గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయా లలో ఆయన రికార్డులను తనిఖీ చేసి,గ్రామంలోని కంపోస్ట్ షెడ్లను పరిశీలించారు.ఆయన వెంట ఎంపీవో మారుతి, జిల్లాపల్లి జీ.పి కార్యదర్శి శ్రీవాణి,జల్లాపల్లి ఫారం జీ.పి కార్యదర్శి రాజేశ్వరి, తదితరులు ఉన్నారు.

# సినిమా తీరు

## యరో హారర్ మూవీ నెం.13' చిత్రం




కాలింగ్ బెల్', 'రాక్షసి' వంటి హారర్ థ్రిల్లర్స్‌తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుని తనకంటూ ఓ ప్రత్యేకమైన బ్రాండ్‌ని ఏర్పరుచుకున్న దర్శకుడు పన్నా రాయల్'ఇంటి నెం.13' చిత్రంతో మరోసారి ప్రేక్షకుల్ని భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. డిఫరెంట్ మిస్టీరియస్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా మార్చి 1న రిలీజ్ అవుతోండగా ఈ చిత్రంతో పన్నా రాయల్ హ్యాట్రిక్ కొడతారని చిత్ర యూనిట్ కాన్ఫిడెంట్‌గా చెబుతోంది. రీగల్ ఫిలిం ప్రొడక్షన్స్ పతాకంపై డా. బర్కతుల్లా సమర్పణలో హేసన్ పాషా చిత్రాన్ని నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వచ్చింది. డిఫరెంట్‌గా ఉన్న టైటిల్.. అంతే డిఫరెంట్‌గా ఉన్న ఫస్ట్‌లుక్ ఆడియన్స్‌లో సినిమాపై క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. మార్చి 1న రిలీజ్ అవుతున్న నేపథ్యంలో 'ఇంటి నెం.13' రిలీజ్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ సినిమాకి సంబంధించిన విశేషాలను దర్శకుడు పన్నారాయల్ వివరిస్తూ 'ఇప్పటివరకు తెలుగు ఆడియన్స్ ఎన్నో హారర్ సినిమాలు చూశారు. వాటికి పూర్తి భిన్నంగా ఉండే సినిమా ఇది. ఈ సినిమాలోని మిస్టరీ, సస్పెన్స్ ఆడియన్స్‌ని కట్టి పడేస్తాయి. సినిమాలో ప్రతి పది నిమిషాలకు వచ్చే ట్విస్ట్‌తో ఆడియన్స్ థ్రిల్ అవుతారు. హారర్ జోనర్‌లో 'ఇంటి నెం.13' డెఫినెట్‌గా ఒక కొత్త ట్రెండ్‌ని క్రియేట్ చేస్తుంది. టెక్నికల్ వేల్యూస్ ఈ సినిమాకి పెద్ద ప్లస్‌పాయింట్ అని చెప్పొచ్చన్నారు. ఈ తరహా సినిమాల్లో విజువల్ ఎఫెక్ట్స్‌కి ఎంతో ప్రాధాన్యం ఉంటుందని, దాన్ని దృష్టిలో ఉంచుకొని హాలీవుడ్ టెక్నీషియన్స్‌తో విజువల్ ఎఫెక్ట్స్ చేయించామన్నారు. ఈ సినిమాకి మరో ప్లస్ పాయింట్ వినోద్ యాజమాన్య మ్యూజిక్ అని తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ఆడియన్స్‌ని థ్రిల్ చేస్తాడన్నారు. స్జబెక్ట్ విపరీతంగా నచ్చడం వల్ల ఔట్‌పుట్ అద్భుతంగా ఉండాలన్న ఉద్దేశంతో నిర్మాత హేసన్ పాషాగారు ఖర్చుకు ఎక్కడా వెనకాడకుండా ఒక మంచి ప్రొడక్ట్‌ని బయటికి తెచ్చారని, మేం అనుకున్న దానికన్నా సినిమా చాలా బాగా వచ్చిందన్నారు. తప్పకుండా ఇది ప్రేక్షకులకు డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ నిస్తుంది' అన్నారు.ఇప్పటివరకు తెలుగు ఆడియన్స్ చూడని ఒక కొత్త తరహా చిత్రం 'ఇంటి నెం.13' . అతని గత చిత్రాలను ఎంత బాగా తీసారో వాటిని మించే స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారన్నారు. మార్చి 1న ఈ డిఫరెంట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. ఈ సినిమాను తప్పకుండా అందరూ ఎంజాయ్ చేస్తారు' అన్నారు. నవీద్‌బాబు, శివాంగి మెహ్రా, ఇర్ఫాన్, నికీషా, ఆనంద్‌రాజ్ (ఒనిజీనిట ఖీజీతీ), తనికెళ్ళ భరణి, పృథ్వీరాజ్, నెల్లూరు సుదర్శన్, శివన్నారాయణ, సత్యకృష్ణ, విజయ రంగరాజు, రవివర్మ, దేవియాని తదితరులు ముఖ్యపాత్రలు పోషించిన ఈ సినిమాకు సంగీతం: వినోద్ యాజమాన్య, సినిమాటోగ్రఫీ: పి.ఎస్.మణికర్ణన్, ఎడిటింగ్: సాయినాథ్ బద్వేల్, కొరియోగ్రఫీ: కె.శ్రీనివాస్, మాటలు: వెంకట్ బాలగోని, పన్నా రాయల్, పాటలు: రాంబాబు గోశాల, నిర్మాత: హేసన్ పాషా, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: పన్నా రాయల్.

## రామ్‌చరణ్ సరసన హీరోయిన్ గా జాన్వీకపూర్

రామ్ చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఆర్‌సీ 16 వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కథా చర్చలు, మ్యూజిక్ సిటళట్టింగ్స్ పూర్తయ్యాయి. అయితే ఈ చిత్రంలో హీరోయిన్ ఎవరు? అని కొద్ది రోజులుగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేరు బయటికొచ్చినా ఎక్కువ వినిపించిన పేరు మాత్రం అతిలోక సుందరి తనయ జాన్వీ కపూర్‌దే. రామ్‌చరణ్‌తో జాన్వీ జోడీ కట్టనుందనే వార్త చాలారోజులుగా హల్‌చల్ చేస్తోంది. ఇప్పుడు అదే నిజమైంది. 'ఆర్‌సీ16' చిత్రంలో రామ్‌చరణ్ సరసన హీరోయిన్ గా జాన్వీకపూర్ నటించనుంది. ఈ విషయాన్ని తన తండ్రి బోనీకపూర్ వెల్లడించారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'త్వరలో జాన్వీకపూర్ చరణ్‌తో నటించనున్న చిత్రం త్వరలోనే ప్రారంభం కానుంది' అని స్వయంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. మ్‌చరణ్ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' చిత్రంలో నటిస్తున్నారు. ఆ షూటింగ్ పూర్తయ్యాక 'ఆర్‌సీ16' ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఏప్రిల్ నుంచి ఈ చిత్రం సెట్స్ మీదకెళ్లనుందని టాక్ వినిపిస్తోంది. నేటివిటీ కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రం తన కెరీర్‌లో అత్యుత్తమ చిత్రం కానుందని గతంలో చరణ్ తెలిపారు. ఇదొక అద్భుతమైన మట్టి చిత్రమని ఆయన వెల్లడించిన సంగతి తెలిసిందే! జాన్వీకపూర్ 'దేవర' చిత్రంలో టాలీవుడ్‌లో అడుగుపెడుతోంది. ఇది ఆమెకు తెలుగులో రెండో సినిమా కానుంది. అయితే జాన్వీ కపూర్ ఈ చిత్రంలో ఖరారైందని బోనీ కపూర్ వెల్లడించినప్పటి నుంచి రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి. జాన్వీని హీరోయిన్ గా తీసుకోవడం పట్ల అభిమానులు నిరాశలో ఉన్నారు. ఆమె గ్లామర్ పాత్రలకు తప్ప నెటివిటీ కథలకు సూట్ కాదని కామెంట్లు చేస్తున్నారు. మరో నెటిజన్ అయితే 'ఆమెను ఎందుకు తీసుకున్నావ్ అన్నా.. ఒక్క హిట్ కూడా లేదు.. మార్చేసేయ్.. జాన్వీ కపూర్ వద్దు బాబోయ్' అని కామెంట్స్ చేశారు.



## అందానికే మరో అందం....



## ఆపరేషన్ వాలెంటైన్ ట్రైలర్.. ఆకాశంలో వరుణ్ మెరుపు దాడి

మెగా హీరో వరుణ్ తేజ్ ఈసారి ఆపరేషన్ వాలెంటెన్స్ అనే సినిమాతో రాబోతున్నాడు. ఎయిర్ ఫోర్స్ వార్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా మార్చి 1వ తేదీన గ్రాండ్ గా విడుదల కాబోతోంది. ఇక సినిమాకు సంబంధించిన ట్రైలర్ ను హిందీలో సల్మాన్ ఖాన్ విడుదల చేయగా తెలుగులో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ విడుదల చేశారు. ట్రైలర్ విషయానికి వస్తే. అప్పటికే ఎయిర్ ఫోర్స్ యుద్ధాలలో చాలా ఒడిదుడుకులను ఎదుర్కొన్న వీర సైనికుడుగా రుద్ర పాత్రలో వరుణ్ తేజ్ కనిపించబోతున్నట్లుగా హైలెట్ చేశారు. ఇక అతన్ని అదుపులో పెట్టడానికి ఉన్నతాధికారులు చేసే ప్రయత్నాలు కూడా ఈ సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. పరిస్థితులను బట్టి రుద్ర శత్రువులపై ఆకాశంలో మెరుపు దాడులు చేయడం మరొక మేజర్ హైలైట్ గా ట్రైలర్లో నిలుస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ కొల్లగొట్టే వ్యూహం కొంతమంది పైలెట్స్ ని కంట్రోల్ చేయడం చాలా కష్టం అనే డైలాగ్ తోనే ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ ఎలా ఉండబోతుందో అర్థమవుతుంది. ఇక ఆకాశంలో అడ్వెంచర్స్ అలవాటుగా చేసుకున్న ఈ వారియర్ ఒకవైపు దేశం కోసం పోరాడుతూనే మరొకవైపు ప్రేయసి కోసం కూడా జీవిస్తూ ఉంటాడని తెలుస్తోంది. ఎయిర్ ఫోర్స్ లో ఇలాంటి రిస్కులు చాలా కామన్ అనే డైలాగ్ కూడా అతని పాత్ర బలాన్ని తెలియజేస్తోంది. ఇక భయమేంటో తెలియని హీరో రెడార్ లో ఉన్నంతవరకు కూడా నాకు ఏమీ అవ్వదు అనే ధీమాతో కనిపిస్తూ ఉన్నాడు. ఇక శత్రువులు దాడి చేసినప్పుడు మనం కూడా అంతే స్పీడుగా దాడి చేయాలి అని అంశాలు ఇందులో కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14 దాడుల నేపథ్యంలో రూపొందుతున్న ఈ ఆపరేషన్ వాలెంటైన్ లో నిజ జీవితంలోని అంశాలను కూడా హైలెట్ చేయబోతున్నట్లుగా తెలుస్తోంది. రియాక్షన్ శత్రువులపై పోరాటం చేయడానికి హీరో రుద్ర ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నాడు శత్రువులు కూడా ఎలాంటి ప్రణాళికలు రచించారు అనేది కూడా ఈ సినిమాలో ప్రధానంగా నిలువబోతున్నట్లు ట్రైలర్ లో చూపించారు. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించగా సోని పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ లో సందీప్ ఈ సినిమాను నిర్మించారు. మిక్కీ జె మేయర్ మ్యూజిక్ అందించగా సాయి మాధవ్ బుర్ర మాటలు అందించారు. తెలుగులోనే కాకుండా ఈ సినిమాలో ఒకేసారి హిందీలో కూడా విడుదల చేస్తున్నారు. మరి సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి. ఒశ్రీబనీ ఖీవజీట - టిల్లు ఇప్పుడప్పుడే ఆగేలా లేదు..!



## పుష్పరాజ్ అంతర్జాతీయ మార్కెట్ కొల్లగొట్టే వ్యూహం

అంతర్జాతీయ సినిమా ఉత్సవాల్లో పాల్గొనడం, పెద్ద స్థాయిలో ప్రపంచ విఖ్యాత సినీప్రముఖులతో సత్సంబంధాలు కొనసాగించడం నిజానికి ఒక అద్భుతమైన మార్కెట్ ఎత్తుగడ. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, పంపిణీదారులు, సంస్థలను కలవడం ద్వారా తమ ఉత్పత్తిని ప్రపంచ మార్కెట్లో విక్రయించడం చాలా సులువు. బాహుబలి, బాహుబలి 2 కోసం ఇలాంటి ఎత్తుగడను దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి- ఆర్కా మీడియా బృందం అనుసరించి పెద్ద స్థాయిలో విజయం సాధించారు. పపంచవ్యాప్తంగా తమ ఉత్పత్తిని అమ్ముకోవాలనే ఆలోచన చేయడంలో ఈ బృందం సాధించిన విజయం దేశంలోని చాలా మంది సినీప్రముఖులకు స్ఫూర్తినిచ్చింది. ఎంపిక చేసుకున్న కంటెంట్ యూనివర్సల్ గా ఉన్నప్పుడు దానిని అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కించినప్పుడు బయటి మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంటుందని కూడా ప్రూవ్ అయింది. జపాన్, చైనా మార్కెట్లలోను ఇప్పుడు ప్రభాస్ పరిచయమయ్యారంటే బాహుబలి ఫ్రాంఛైజీ కోసం ఎంచుకున్న రిలీజ్ మోడల్ ప్రధాన కారణం. ఆ తర్వాత ఆర్.ఆర్.ఆర్ సినిమాని కూడా ప్రపంచ మార్కెట్లో పెద్ద స్థాయిలో ప్రమోట్ చేయగలిగారు. అంతర్జాతీయ సినిమా ఉత్సవాల్లోను ఆర్.ఆర్.ఆర్ కి ప్రచారం దక్కింది. ఆస్కార్, గోల్డెన్ గ్లోబ్స్, ఫిలింక్రిటిక్స్ పురస్కారాల్లో రాజమౌళి అండ్ టీమ్ హాలీవుడ్ ప్రముఖులను కలుసుకుని మునుముందు మార్కెట్ కి కొత్త దారులు తెరిచే వ్యూహాన్ని అనుసరించారు. ఇటీవల ప్రభాస్ నటిస్తున్న ప్రాజెక్ట్ కే (కల్కి) ని అంతర్జాతీయ సినిమా ఉత్సవాల్లో ప్రమోట్ చేస్తున్నారు. ఇప్పుడు ఇదే బాటలో పుష్ప 2 చిత్రాన్ని ప్రమోట్ చేసేందుకు సుకుమార్ - అల్లు అర్జున్ బృందం ప్రణాళికలు అమలు చేస్తోంది. 'పుష్ప 2' ప్రమోషన్స్ కోసం ఇటీవల చిత్రకథానాయకుడు అల్లు అర్జున్ 74వ బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ కోసం బెర్లిన్ (జర్మనీ) కి వెళ్లాడు. అక్కడ పుష్ప ప్రీమియర్ అయింది. ఓవైపు సుకుమార్ విరామం అన్నదే లేకుండా పుష్ప 2 చిత్రీకరణను పూర్తి చేస్తుంటే, అల్లు అర్జున్ పుష్ప 2 షూటింగ్ నుండి విరామం తీసుకొని తన నిర్మాత మైత్రి రవిశంకర్‌తో కలిసి బెర్లిన్‌కు వెళ్లాడు. అయితే బన్ని తన షూటింగును కూడా వదిలేసి ఈ వేడుకలకు ఎందుకు వెళ్లారు? అంటూ ఆరాలు మొదలయ్యాయి.నిజానికి పుష్ప చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా గొప్ప క్రేజ్ వచ్చింది. అందువల్ల ఇప్పుడు పుష్ప 2 కోసం ఆ క్రేజ్ ని ఎన్‌క్యాష్ చేయాలంటే సినిమా పండగల్లో ప్రముఖులతో రిలేషన్ షిప్ అవసరం. యూరప్ దేశాల్లో పాపులర్ డిస్ట్రిబ్యూటర్‌లను కనుగొని వారి స్వంత భాషలలో సినిమాకు మార్కెట్ చేయాలనే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. సినిమా సంబరాల్లో ప్రముఖులతో స్నేహం దీనికి అన్ని విధాలా సహకరిస్తుందనడంలో సందేహం లేదు. పుష్ప 2 చిత్రాన్ని దక్షిణాది బాషలతో పాటు హిందీలోను విడుదల చేయనున్నారు. దీంతో పాటు అమెరికా, బ్రిటిన్ సహా యూరప్ దేశాల్లో గల్ఫ్, ఐల్యాండ్ కంట్రీస్ లోను విడుదల చేయాలనేది ప్లాన్. రష్యన్ భాషలో పుష్ప విడుదలైంది కాబట్టి ఇప్పుడు పుష్ప 2 చిత్రాన్ని కూడా అక్కడ విడుదల చేసి బన్ని ముఖానికి మార్కెట్ విలువ పెంచుతారనే భావిస్తున్నారు. ఇక పుష్ప 2 చిత్రాన్ని చైనీ భాషల్లో విడుదల చేస్తారా లేదా? అన్నది వేచి చూడాలి.



## పైల్స్, మలబద్ధకానికి గుడ్‌బై చెప్పే యోగా భంగిమలు!



మలబద్ధకం అనేది జీవితంలో ఒక సాధారణ సమస్య. ఈ మలబద్ధకం అనేక కారణాల వల్ల ఒక వ్యక్తికి సంభవించవచ్చు. మీరు మలబద్ధకంతో ఉంటే, మీరు ఏ పనిని హాయిగా చేయలేరు మరియు మీరు చాలా అసౌకర్యాన్ని ఎదుర్కోవలసి ఉంటుంది. మలబద్ధకం చెడు కోలిక్ లేదా జీర్ణ సమస్యల వల్ల సంభవించవచ్చు. దీనికి తోడు ఈ రోజుల్లో చాలా మంది జంక్ ఫుడ్ కొని తింటారు. ఇవి జీర్ణవ్యవస్థకు హాని కలిగించే ఆహారాలు. అంతే కాకుండా నిత్యం కంప్యూటర్ ముందు కూర్చుని రోజులు గడుపుతున్నాం. శారీరక శ్రమ లేకపోవడం వల్ల, మలబద్ధకం కూడా సమస్య కావచ్చు.కాబట్టి మీరు మలబద్ధకం సమస్య నుండి బయటపడాలంటే, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం మరియు వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలలో పాల్గొనడం చాలా ముఖ్యం. యోగా త్వరగా మలబద్ధకం నుండి బయటపడటానికి సహాయపడుతుంది. మరియు ఇది ఎవరైనా సులభంగా చేయవచ్చు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకుంటారు. మలబద్ధకం నుండి బయటపడటానికి మీకు సహాయపడే కొన్ని సాధారణ యోగా భంగిమలను ఇప్పుడు చూద్దాం.భుజంగాసనం సులభమైన యోగాసనాలలో ఒకటి మరియు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఈ ఆసనం జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది మరియు ఆకలిని బాగా ప్రేరేపిస్తుంది. ఇది అపానవాయువు నుండి కూడా ఉపశమనం కలిగిస్తుంది. కానీ ఈ ఆసనాన్ని గర్భిణీ స్త్రీలు, అల్సర్ రోగులు మరియు గుండె సమస్యలు ఉన్నవారు చేయకూడదు. అలాగే, పొత్తికడుపు గాయాలు ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి. ముందుగా చిత్రంలో చూపిన విధంగా నేలపై పడుకోవాలి.కాళ్లను చాచి, వెనుక మోకాళ్లు ఒకదానికొకటి తాకేలా ఒకదానికొకటి తీసుకురావాలి. మీకు వెన్నునొప్పి ఉంటే, మీ కాళ్ళ మధ్య 1-2 అడుగుల ఖాళీని వదిలివేయండి.తర్వాత అరచేతిని ఛాతీ ప్రాంతం వెంట నేలపై ఉంచాలి.తర్వాత శ్వాస తీసుకుంటూ శరీరాన్ని పైకి ఎత్తాలి. అప్పుడు బరువు మొత్తం చేతులు మరియు తొడలపై పడాలి.మెడను వీలైనంత వెనుకకు వంచాలి. శ్వాసను 10-60 సెకన్ల పాటు పట్టుకోండి. మీరు అసలు స్థానానికి తిరిగి వచ్చినప్పుడు ఊపిరి పీల్చుకోండి. ఇలా 3-5 సార్లు చేయాలి.ఈ ఆసనం మొత్తం వెన్నెముకను బలపరుస్తుంది. ఉదర కండరాలను మసాజ్ చేయడంతోపాటు, జీర్ణ యాసిడ్ స్రావాన్ని నియంత్రించడంతోపాటు, ఈ ఆసనం నాభి చక్రాన్ని ప్రేరేపిస్తుంది. ఈ ఆసనం గర్భధారణ సమయంలో మరియు బహిష్టు సమయంలో చేయరాదు. అదేవిధంగా గుండె మరియు వెన్నెముక వ్యాధులు ఉన్నవారు చేయకూడదు.ఎలా చేయాలి:చిత్రంలో చూపిన విధంగా ముందుగా కాళ్లను నిటారుగా ఉంచి కూర్చోవాలి.కుడి పాదాన్ని ఎడమ పిరుదు వైపుకు తీసుకుని వంచాలి.తర్వాత కుడి కాలును ఎడమ మోకాలి బయటికి తీసుకురావాలి. వెన్నెముక మరియు మోచేతులను నిటారుగా ఉంచేటప్పుడు పాదాలు నేలను తాకాలి. శ్వాస వదులుతూ పైభాగాన్ని సరైన స్థితిలోకి తిప్పండి. మీ ఎడమ చేతితో మీ కుడి కాలును పట్టుకోండి మరియు మీ కుడి చేతిని మీ వెనుక ఉంచండి. ఇలా 20-30 సెకన్ల పాటు మామూలుగా శ్వాస తీసుకోండి. అప్పుడు సాధారణ స్థితికి చేరుకోండి.ఈ ఆసనం వేసేటప్పుడు శరీరం మొత్తం తల నుండి కాలి వరకు చేరి ఉంటుంది. ఈ ఆసనం ఉదర కండరాలను బలపరుస్తుంది మరియు శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. గర్భిణీ స్త్రీలు మరియు ఆస్తమా రోగులు ఈ ఆసనం చేయకూడదు. ముందుగా చిత్రంలో చూపిన విధంగా నిటారుగా కూర్చోండి.వెనుక కాళ్లను నిటారుగా ఉంచి కూర్చోండి.శ్వాస తీసుకుంటూ చేతులను పైకి ఎత్తి శరీరాన్ని కాస్త వెనక్కి వంచాలి. తర్వాత నిదానంగా శ్వాస వదులుతూ ముందుకు చేతులతో కాలి వేళ్లను తాకేందుకు ప్రయత్నించండి. అదే సమయంలో మీ తలతో మోకాలిని తాకడానికి ప్రయత్నించండి.30 సెకన్ల పాటు పట్టుకోండి, ఆపై అసలు స్థానానికి తిరిగి వెళ్లండి. ఇలా 3 సార్లు చేయండి.ఇతర ఆసనాల మాదిరిగా కాకుండా, సలాపాసన సరైన భంగిమను సాధించడానికి కొన్ని నిర్దిష్ట కదలికలు అవసరం. ఈ ఆసన సమయంలో వెన్నెముకను సాగదీయడం ద్వారా ఉదర కండరాలు బలపడతాయి. దిగువ శరీరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఆసనం చేస్తారు. ప్రారంభంలో ఈ ఆసనం చేస్తున్నప్పుడు, మీరు కొన్ని వశ్యత సమస్యలను ఎదుర్కోవచ్చు. కానీ అది చివరికి మెరుగుపడుతుంది. స్లిప్డ్ డిస్క్ మరియు ఆస్తమా ఉన్న రోగులు ఈ ఆసనాన్ని చేయకూడదు.చిత్రంలో చూపిన విధంగా ముందుగా నేలపై పడుకోవాలి. మీ చేతులను మీ వైపులా ఉంచండి. తల వెనుక భాగాన్ని పైకెత్తి వెనుకకు పైకి లేపాలి.

## ఓటమి బాధలో ఉన్న ఇంగ్లండ్‌కు అదిరిపోయే న్యూస్.. అదే జరిగితే?



టీమిండియాతో తొలి టెస్టులో విజయం సాధించిన ఇంగ్లండ్.. ఆ తర్వాత మ్యాచ్‌ల్లో తమ జోరును కొనసాగించలేకపోయింది. వరుస మ్యాచ్‌ల్లో భారత చేతిలో దారుణ ఓటమి పాలై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటుంది.రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో టెస్టులో అయితే ఏకంగా 434 పరుగుల తేడాతో ఘోర ఓటమి పాలైంది.టీమిండియా దెబ్బకు గత 90 ఏళ్లలో ఎన్నడూ చూడని ఓటమిని ఇంగ్లండ్ చవిచూసింది. అయితే ఓటమి బాధలో ఉన్న ఇంగ్లండ్ జట్టుకు, అభిమానులకు ఓ గుడ్ న్యూస్. వెన్ను గాయం కారణంగా దాదాపు ఏడాది నుంచి బౌలింగ్‌కు దూరంగా ఉన్న ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తిరిగి బంతి పట్టేందుకు సిద్ధమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి.తాజాగా స్టోక్స్ చేసిన వ్యాఖ్యలు ఈ వార్తలకు మరింత ఊతమిస్తున్నాయి. మూడో టెస్టు అనంతరం స్టోక్స్ ప్రముఖ క్రీడా వెబ్‌సైట్ ఈఎస్పీఎన్‌క్రిక్‌ఇన్‌ఫోకు ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ సందర్భంగా మీరు బౌలింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నారా అన్న ప్రశ్న ఇంగ్లీష్ కెప్టెన్‌కు ఎదురైంది.అందుకు బదులుగా.. "నేను కచ్చితంగా బౌలింగ్ చేస్తానని చెప్పలేను. అలా అని చేయని కూడా చెప్పలేను. నేను బౌలింగ్ చేయాలా వద్దా అన్న విషయం కోసం మా వైద్య బృందంతో ఇంకా చర్చిస్తున్నాను. కానీ ప్రాక్టీస్ సెషన్స్‌లో అయితే నేను 100కు 100 శాతం బౌలింగ్ చేయగల్గుతున్నాను.ఆ సమయంలో నాకు ఎటువంటి సమస్యలేదు. త్వరలో తిరిగి మళ్లీ బౌలింగ్ చేయగలనని" ఆశిస్తున్నానని స్టోక్స్ చెప్పుకొచ్చాడు. కాగా ఫిబ్రవరి 23 నుంచి రాంఛీ వేదికగా నాలుగో టెస్టు ప్రారంభం కానుంది.

## మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో సినిమా తారలు.. ఎవరెవరురానున్నారంటే?

మహిళల ప్రీమియర్ లీగ్ (చిఖఒ) రెండో సీజన్ ఫిబ్రవరి 23న ప్రారంభమవుతుంది. డిఫెండింగ్ ఛాంపియన్స్ ముంబై ఇండియన్స్, రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ప్రారంభ మ్యాచ్ జరగనుంది.బెంగళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియం ఈ హై-వోల్టేజ్ పోరుకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ మ్యాచ్‌కు ముందు, బిసిసిఐ గ్రాండ్ ఓపెనింగ్ వేడుకను నిర్వహించింది, ఇందులో కొంతమంది బాలీవుడ్ తారలు కనిపిస్తారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ప్రముఖ నటుడు కార్తీక్ ఆర్యన్ ప్రారంభ వేడుకలో ప్రదర్శన ఇవ్వనున్నారు. ప్రారంభోత్సవ వేడుక ఫిబ్రవరి 23 సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమవుతుంది. కార్తీక్ ఆర్యన్‌తో పాటు పలువురు బాలీవుడ్ స్టార్స్ ఇందులో కనిపిస్తారు. చివరిసారి కియారా అద్వానీ కృతి సనన్ వంటి అందాల తారలు డబ్ల్యూపీఎల్ ప్రారంభ వేడుకలో ప్రదర్శనలు ఇచ్చారు. అదే సమయంలో, గాయకుడు ఏపీ ధిల్లాన్ తన పాటలతో క్రికెట్ అభిమానుల హృదయాలను గెలుచుకున్నాడు.డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ ఫిబ్రవరి 23 నుంచి మార్చి 17 వరకు జరగనుంది. గతేడాది మాదిరిగానే మొత్తం ఐదు జట్లు 22 మ్యాచ్‌లు ఆడనున్నాయి. కానీ, ఈసారి పెద్ద మార్పు వచ్చింది. నిజానికి గత ఏడాది ఈ లీగ్‌ని ముంబై, నవీ ముంబై అనే రెండు స్టేడియంలలో నిర్వహించారు. అయితే ఈసారి ఈ లీగ్ హోస్టింగ్‌ను ముంబైకి బదులుగా బెంగళూరు, ఢిల్లీలో నిర్వహించనున్నారు.టోర్నీలో తొలి 11 మ్యాచ్‌లు బెంగళూరులో జరగనున్నాయి. దీని తరువాత, మొత్తం ఐదు జట్లు ఢిల్లీకి వెళ్తాయి, అక్కడ ఎలిమినేటర్‌తో సహా చివరి మ్యాచ్ జరగనుంది. లీగ్



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUSALAGALLY, JAWAHAR ROAD, Town & Dist. NIZAMABAD-503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.